క్లుప్తంగా...

నేడు విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బన్సీలాల్‌పేట్: విద్యుత్తు వినియోగదారుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 12న (నేడు) పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు డీఈ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ సమీపంలోని జేమ్స్‌స్ట్రీట్ ఏడీఈ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కొనసాగుతుందని వినియోగదారులు తమ సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 38, పందిరిబీర 35, క్యాబేజీ 14, క్యారెట్ 40, దొండ 19, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 65, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 15, సొరకాయ 7, అరటికాయ 10 (ఒకటి), మునగకాయ 3–4, ముల్లంగి 4–6.

జ్యోతిరావు పూలేకు మహాత్మా బిరుదు చరిత్రాత్మకం

ఉస్మానియా యూనివర్సిటీ: జ్యోతిరావు పూలే సేవలను గుర్తించి 1888, మే 11న మహాత్మా అనే బిరుదుతో సత్కరించడం చరిత్రలో నిలిచిపోయిందని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ పేర్కొన్నారు. గురువారం దూరవిద్య విద్యాకేంద్రం సెమినార్ హాల్లో జ్యోతిరావు పూలే రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో పూలేకు మే 11న మహాత్మా బిరుదును పురస్కరించుకొని జాతీయ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లమల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, విశ్రాంత అధ్యాపకులు మురళి మనోహర్, అడపా సత్యనారాయణ, శ్రీనివాస్‌లు, తిరుమలి పాల్గొని ప్రసంగించారు.

'బీఆర్ఎస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు'

అడ్డగుట్ట: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాల మహానాడు సికింద్రాబాద్ మహిళా అధ్యక్షురాలు రామలీల ఆరోపించారు. గురువారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద దళితులు, పేద ప్రజలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే పేద ప్రజల బతుకులు బాగుపడుతాయని అనుకుంటే మరిన్ని కష్టాలు పెరిగాయని విమర్శించారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ ఒక్క పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నారన్నారు. తెలంగాణలో మాత్రం కేవలం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే అందుతున్నాయని ఆరోపించారు. అర్హులైన దళితులను గుర్తించి 'డబుల్' ఇళ్లు, దళితబంధు అందజేయాలని డిమాండ్ చేశారు.

యాచకుడి మృతదేహం లభ్యం

లాలాపేట: ఓ యాచకుడి మృతదేహం లభ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు కార్మికుడు కిష్టయ్య బుధవారం ఉదయం హబ్సిగూడ సీసీఎంబీ వద్ద విధులు నిర్వహిస్తుండగా ఆర్టీసీ బస్టాప్‌లోని బెంచీపై అదే ప్రాంతంలో భిక్షాటన చేసే ఓ వృద్ధుడు పడి ఉండటాన్ని గమనించారు. కదలిక లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రేమపేరుతో లైంగిక దాడి

● యువకుడిపై కేసు

అమీర్‌పేట: ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకుని లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం .. ఎస్ఆర్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న 17 ఏళ్ల బాలికను ఇదే ప్రాంతానికి చెందిన గడ్డం సునీల్ ప్రేమపేరుతో నమ్మించి మాయమాటలు చెప్పి పలుమార్లు లైగింక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

సనత్‌నగర్: విద్యుదాఘాతానికి గురై దినసరి కూలీ మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వివరాల ప్రకారం..నల్లగొండ జిల్లా నూతన్‌కల్ మండలం, ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మన్నూరు వెంకన్న (40) నగరానికి వలసొచ్చి భవన నిర్మాణ పనులు, పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. గత కొంతకాలంగా సతీష్ అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ గురువారం సాయంత్రం బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని ఓ ఇంటికి రంగులు వేస్తున్నాడు. మొదటి అంతస్తుకు రంగులు వేసే క్రమంలో పక్కనే ఉన్న హైటెన్షన్ తీగలకు చేయి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటినా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే వెంకన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదానికి కారణమైన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆధునిక సౌకర్యం.. మెరుగైన వైద్యం

గాంధీకే సాధ్యం

రూపురేఖలు మారనున్న గాంధీ ఆస్పత్రి

● ప్రారంభానికి సిద్ధంగా మూడు భవన సముదాయాలు
● అందుబాటులోకి మరింత మెరుగైన వైద్యసేవలు

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రూపురేఖలు మారనున్నాయి. అత్యాధునిక సదుపాయాలు, కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన మూడు నూతన భవన సముదాయాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. గాంధీ అత్యవసర విభాగం వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో (మ్యాచింగ్ గ్రాంట్) నిర్మిస్తున్న మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)తో గర్భిణులు, బాలింతలు రెండింతలు, రోగి సహాయకుల సంఖ్య నాలుగింతలు పెరిగే అవకాశం ఉందని భావించిన ఆస్పత్రి అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎంసీహెచ్ భవనం ప్రక్కనే అత్యాధునిక డైట్ క్యాంటిన్ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. డైట్ క్యాంటిన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను ఇన్ పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులకు అందించేందుకు ప్రత్యేక ఆకాశ వంతెనలు (స్కై బ్రిడ్జ్) నిర్మించనున్నారు. ఓపీ విభాగం ముందు ప్రైవేటు మెడికల్ షాపుల భవనంపైన నిర్మించిన మరో అంతస్తులో నైట్ షెల్టర్ అందుబాటులోకి రానుంది.

రూ.50 కోట్లతో ఎనిమిది అంతస్తుల్లో..

రూ. 50 కోట్ల వ్యయంతో జీ+8 అంతస్తుల్లో చేపట్టిన మాతాశిశు సంరక్షణ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అధునాతన వైద్య యంత్రాలు, పలు రకాల వసతులు, సౌకర్యాలతో కూడిన ఐసీయూ, ఆధునిక ఆపరేషన్ థియేటర్లతో పాటు మరో రెండు వందల పడకలు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడుతారు. ప్రధాన భవనంలో కొనసాగుతున్న గైనకాలజీ, పిడియాట్రిక్ విభాగాలను ఇక్కడకు తరలించి, తల్లి బిడ్డలకు ఒకేచోట మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. గైనకాలజీ, పిడియాట్రిక్, అనస్థీషియాతో పాటు పలు రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం గాంధీలో నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా, ఎంసీహెచ్ భవనం అందుబాటులోకి వస్తే ప్రసవాల సంఖ్య రెట్టింపు అవుతుంది.

సాక్షి వరుస కథనాలతో స్పందన

రెండు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న డైట్ క్యాంటిన్ సమస్య వైద్యమంత్రి హరీష్‌రావు చొరవతో పరిష్కారమైంది. రూ.2.25 కోట్ల నిధులు కేటాయించడంతో అత్యాధునిక హంగులతో చేపట్టిన నూతన డైట్ క్యాంటిన్ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆస్పత్రి డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరడంతో మురుగునీరు సెల్లార్‌తోపాటు డైట్ క్యాంటిన్‌ను ముంచెత్తింది. తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్న మురుగు మధ్యలోనే ఆహార పదార్థాలు తయారు చేయడాన్ని స్వయంగా చూసిన పలువురు వైద్యులు డైట్ క్యాంటిన్ భోజనాన్ని తిరస్కరించారు. గతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్, గాంధీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) చైర్మన్ శర్మన్ మురుగుతో నిండిన డైట్ క్యాంటిన్‌ను చూసి ఖంగుతున్నారు. మురుగుతో నిండిన డైట్ క్యాంటిన్‌పై సాక్షి దినపత్రిక పలుమార్లు ప్రధాన శీర్షికతో కథనాలు ప్రచురించగా స్పందించిన మంత్రి హరీష్‌రావు నిధులు కేటాయించారు.



చివరి దశలో మాతాశిశు సంరక్షణ భవనం

సీడీఎంఏ ఆధ్వర్యంలో నైట్ షెల్టర్..

కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఆధ్వర్యంలో రూ.91 లక్షల వ్యయంతో గాంధీఆస్పత్రి ప్రాంగణంలో చేపట్టిన నైట్‌షెల్టర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోగితోపాటు సహాయకులుగా ఒకరికి మాత్రమే వార్డులోకి అనుమతి ఉంది. రోగిని డిశ్చార్జి చేసేంత వరకు మిగిలిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్ షెడ్లు, చెట్లు కింద రోజుల తరబడి ఉంటున్నారు. గాంధీ ఇన్‌పేషెంట్ విభాగంలో నిత్యం సుమారు రెండు వేల మంది చికిత్సలు పొందుతుంటారు. రోగి సహాయకులు కాలకృత్యాలు తీర్చుకుని, రాత్రి సమయాల్లో నిద్రించేందుకు నిర్మించిన షెల్టర్‌హోంలో మొత్తం వంద పడకలు ఏర్పాటు చేసి స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కేటాయించారు.



కొనసాగుతున్న డైట్ క్యాంటిన్ భవన నిర్మాణం

త్వరలోనే అందుబాటులోకి



గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మాతాశిశు సంరక్షణ కేంద్రం, డైట్ క్యాంటిన్, నైట్‌షెల్టర్ భవన సముదాయాల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వైద్యమంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించి సీఎం కేసీఆర్ ఆశలు, ఆశయాలకు అనుగుణంగా ఆరోగ్య తెలంగాణ ఆవిష్కరణకు మా వంతు కృషి చేస్తాం.

–ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

కలుషిత జలాల సమస్య పరిష్కారానికి చర్యలు



నూతన సీవరేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న పద్మారావు గౌడ్

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గంలో కోటి రూపాయల వ్యయంతో కలుషిత జలాల సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తెలిపారు. మెట్టుగూడ డివిజన్ చింతబావిలో రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న నూతన సీవరేజీ పైప్‌లైన్ పనులను గురువారం ఆయన కార్పొరేటర్ సునీతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో మంచినీటి సమస్యలను పరిష్కరించామని, కలుషిత జలాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సుమారు కోటి రూపాయల వ్యయంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. కలుషిత జలాల సరఫరా జరుగుతున్నట్లు సమాచారం లేదా ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెట్టుగూడ డివిజన్ చింతబావిలో ఇటీవల కలుషిత జలాలు సరఫరా కావడంతో సుమారు 350 మంది అస్వస్థతకు గురైన సంగతి విదితమే. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం ప్రభు, డీజీఎం సరిత, మేనేజర్ నిఖిత, బీఆర్ఎస్ నాయకులు కిషోర్‌కుమార్, వంజరి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ యువకుడిని ఆస్పత్రికి తెచ్చిందెవరు?

● అనుమానాస్పద మృతి కేసుపై రంగంలోకి పోలీసులు
● 200 సీసీ కెమెరాల ఫుటేజీల పరిశీలన



మృతుడి చేతిపై హిందీలో ఉన్న జితేందర్, క్రిష్ టాటు

చిలకలగూడ : అనుమానాస్పద స్థితిలో మృతి కేసును పోలీసులు సవాల్‌గా తీసుకుని పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతుని చేతిపై ఉన్న టాటూ ఆధారంగా ప్రత్యేక నిఘా బృందాలు రంగంలోకి దిగాయి. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి నుంచి పంజాగుట్ట వరకు సుమారు 200 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన చిలకలగూడ పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమైనట్లు విశ్వసనీయ సమాచారం. వివిధ భాగాల్లో గాయలు, అపస్మారకస్థితిలో ఉన్న ఓ యువకుడిని ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం వేకువజాము 2 గంటలకు గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చి ఎలాంటి వివరాలు వెల్లడించకుండా, స్ట్రెచర్‌పై వదిలిలేసి పారిపోయారు. విధుల్లో ఉన్న వైద్యులు సదరు యువకుడిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని ముఖం, ఛాతీ పలు భాగాల్లో కమిలిన గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. ఓ ఆటోలో ముగ్గురు వ్యక్తులు ఆస్పత్రిలోకి వచ్చినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. ఆటో నంబరు ఆధారంగా ఆస్పత్రి నుంచి పంజాగుట్ట వరకు 200 ఫుటేజీలనున పరిశీలించి కీలక ఆధారాలు సేకరించారు. మృతుని కుడిచేతిపై హిందీభాషలో జితేందర్, క్రిషి పేర్లతో పాటు లవ్ సింబల్ టాటూ ఆధారంగా బిహార్, వెస్ట్‌బెంగాల్, ఒడిషా రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా అంచనాకు వచ్చారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, చిలకలగూడ ఏసీపీ శ్రీనివాస్, సీఐ నరేష్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయి. రెండ్రోజుల్లో కేసును ఛేదిస్తామని పోలీసులు పేర్కొంటున్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఓయూ చీఫ్ వార్డెన్ కార్యాలయం ఎదుట హాస్టళ్లలో పని చేస్తున్న సిబ్బంది ధర్నాకు దిగారు. ఓయూలోని వివిధ ప్రైవేటు కాంట్రాక్టు సంస్థల ఆధ్వర్యంలో పని చేస్తున్న 382 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల నుంచి సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని సీఐటీయూ నాయకులు మహేందర్ పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో 1వ తేదీన చెల్లించాల్సిన వేతనాలను 20 వరకు ఇవ్వడం లేదని ఆరోపించారు వేతనం నుంచి ఈఎస్ఐ, ఈపీఎఫ్ కట్ అవుతున్నా ఇంత వరకు ఒక్కరి కూడా చెల్లించలేదన్నారు. అనంతరం చీఫ్ వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఈ జలం.. తాగాలంటే భయం



లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట లక్ష్మీనగర్‌లో గత కొన్ని రోజుల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పైపులైన్‌లు ధ్వంసమై తాగునీటి పైపులైన్‌లో డ్రైనేజీ నీరు కలిసి వస్తుందని లక్ష్మీనగర్‌వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే నీరు మురుగుతో పాటు దుర్వాసన వస్తుందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల మెట్టుగూడ డివిజన్ చింతబావిలో కలుషిత జలాలు సరఫరా కావడంతో సుమారు 350 మంది అస్వస్థతకు గురైన సంగతి విదితమే. ఇలాంటి నీరు తాగితే ప్రాణాలకే ముప్పు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు, వైద్యులు

అమీర్‌పేట: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అమీర్‌పేట అపోలో స్పెక్ట్రా ఆసుపత్రి వైద్యులు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా గురువారం ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. మన దైనందిన జీవితంలో ప్రథమ చికిత్స, ఇతర ప్రాథమిక అత్యవసర నిర్వహణపై శిక్షణ పొంది ఉండాలన్నారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రయాణికులు, లేదా సిబ్బంది అకస్మాత్తుగా హార్ట్ అటాక్ వచ్చి పడిపోయినా, ఇతర కారణాలతో ఇబ్బందులకు గురవుతే సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించవచ్చన్నారు. ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ జి.శంకర్‌రాజు, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.సురేష్, జ్యోతి, చక్రధర్, చిరంజీవి, ప్రసాద్, వైద్యులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రసూల్‌పురా: తిరుమలగిరి టీచర్స్ కాలనీలోని సాయిబాబా శివాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకం, అర్చన, హారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజనీర్ గోపాల కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. పూజలో ఆనందరావు, నారాయణ, జగన్ మోహన్ రెడ్డి, సంతోష్, అశోక్, అంజి రెడ్డి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న గోపాల కృష్ణదాస్



రవిసింగ్ బిడ్లాన్‌ను సన్మానించిన మర్రి శశిధర్‌రెడ్డి

రవిసింగ్ బిడ్లాన్‌కు సన్మానం

సనత్‌నగర్: ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 105 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన రవిసింగ్ బిడ్లాన్‌ను బీజేపీ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి సన్మానించారు. సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని వాల్మీకి జిమ్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రవిసింగ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. 12 దేశాల క్రీడాకారులతో తలపడ్డ రవిసింగ్ భారతదేశం తరుపున విజయకేతనం ఎగరవేయడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలను సాధించి దేశానికి పేరు ప్రతిష్ట తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా రవిసింగ్ బిడ్లాన్‌కు ఆయన నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో హృషీకేశ్, ఆకూరి శ్రీనివాసరావు, నెమలి ఆనంద్, వై.శ్రీనివాస్, మల్లికార్జున్‌గౌడ్, సుధాకర్, రవికాంత్‌గౌడ్, పురుషోత్తం, నరేందర్, కేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తా



సాత్వికన్‌ను అభినందిస్తున్న మన్నే క్రిశాంక్

రసూల్‌పురా: వివిధ క్రీడల్లో రాణిస్తున్న వారికి తన వంతుగా ప్రోత్సహిస్తానని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. ఇటీవల పంజాబ్ మోహాలీలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చాంపియన్ షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన కంటోన్మెంట్ అన్నానగర్‌కు చెందిన నాలుగవ తరగతి విద్యార్థి సాత్విక్‌ను క్రిశాంక్ అభినందించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయులు గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడి స్వాతిక్‌కు మరింత సహాయం, తగిన విధంగా ప్రోత్సాహం అందించేలా చూడాలని కోరారు.

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానించిన దృశ్యం

అమీర్‌పేట: ఆసియా పసిఫిక్ మాస్టర్స్ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులను దిశా కమిటీ సభ్యులు చరణ్‌సింగ్ ఆధ్వర్యంలో గురువారం అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో ఘనంగా సత్కరించారు. క్రీడల్లో విజయం సాధించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. మొత్తం 30 మంది క్రీడాకారుల బృందం వివిధ పోటీల్లో పాల్గొంటున్నట్లు మాస్టర్స్ గేమ్స్, స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ కొలన్ జగ్జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంగీత, సెక్రటరీ జనరల్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సర్కారు వెనకబడి

● లష్కర్ పాఠశాలల్లో చతికిలపడ్డ పది ఫలితాలు
● ఉపాధ్యాయుల తీరుపై తల్లిదండ్రుల అసహనం



కార్పొరేట్ పాఠశాలను తలపించేలా న్యూబోయిగూడ ప్రభుత్వ పాఠశాల

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో వెనుకబడ్డాయి. ఇటీవల విడుదలైన ఫలితాలే అందుకు నిదర్శనం. విద్యాభివృద్ధితో తమ పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందనే తల్లిదండ్రులు పది ఫలితాలను చూసి తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో వేయాలంటే జంకుతున్నారు. పేదరికం,ఆర్థిక సమస్యలతో తమ పిల్లలు విద్యకు దూరం కావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే ఫలితాలు తమను తీవ్ర నిరాశ పరుస్తున్నాయని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఒకప్పుడు ఎస్ఎస్‌సీ ఫలితాలతో సర్కారు బడులు ఓ వెలుగు వెలిగాయి. అయితే ఇటీవల సదరు పాఠశాలలు ఫలితాల్లో వెనకబడుతూ వస్తున్నాయి.

పర్యవేక్షణ లోపమేనా?

ఉపాధ్యాయుల పర్యవేక్షణాలోపం, విద్యాబోధనలో సరైన శ్రద్ధాసక్తులు కనబర్చకపోవడం వంటి పలు కారణాలు విద్యార్థుల ఫలితాలపై ప్రభావం చూపాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. విద్యలో గతమెంతో ఘన చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ స్మారక పాఠశాల, ఆదయ్య ప్రభుత్వ స్మారక పాఠశాల, న్యూబోయిగూడ ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, మోండా మార్కెట్ ప్రభుత్వ పాఠశాలలు గత కొన్ని సంవత్సరాల నుంచి ఎస్ఎస్‌సీ ఫలితాల్లో వెనుకబడి పోతున్నాయి. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నా ఫలితాల్లో మాత్రం ఆ స్థాయిలో రావడం లేదనేది వాస్తవం. ఎక్కువ మంది విద్యార్థులు గణితం, సైన్స్‌లోనే తప్పారు.

ఆయా పాఠశాలల ఫలితాలు ఇలా..

- బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 27 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.
- రాంగోపాల్‌పేట్ డివిజన్ హైదర్‌బస్తీలోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ స్మారక బాలికల పాఠశాలలో 47 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 25 మంది మాత్రమే పాస్ అయ్యారు.
- ఓల్డ్‌బోయిగూడలోని సుప్రసిద్ధమైన ఆదయ్య స్మారక ప్రభుత్వ పాఠశాలలో 22కి 14 మంది ఉత్తీర్ణత పొందారు.
- మోండా మార్కెట్ డివిజన్‌లోని మోండా మార్కెట్ ప్రభుత్వ పాఠశాలలో 14 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

కారణాలు ఎన్నో!

ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యాభివృద్ధి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. ఇటీవల సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాల మెరుగుతో పాటు విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి సౌకర్యాలు, సదుపాయాలు కూడా మెరుగుపర్చింది. అయితే ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా మురికివాడలు, బస్తీల్లోని విద్యార్థులు ఎక్కువగా చదువుకుంటున్నారు. బస్తీల్లోని వాతావరణం, అక్కడి పరిస్థితులు విద్యార్థుల విద్యపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. పాఠశాలల్లో ఉన్నప్పుడు తప్ప ఇంటికి వెళ్లాకా అక్కడ చదువుపై అంతా శ్రద్ధ పెట్టకపోవడం తల్లిదండ్రుల నియంత్రణ, పర్యవేక్షణ కొరవడటం వంటి అనేక కారణాలు వారి విద్యాభివృద్ధిపై ప్రభావం చూపుతున్నాయని పలువురు అంటున్నారు.

ఫలితాలపై సమీక్షిస్తాం..

ఎస్ఎస్‌సీ ఫలితాలను సమీక్షించి రానున్న కాలంలో మంచి ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. మెరుగైన ఫలితాల కోసం నిర్దిష్టమైన కార్యచరణతో ముందుకు సాగుతూ మెరుగైన విద్యా బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దుతాం. ఫలితాలపై సమీక్ష చేసి వెనకబడటానికి గల కారణాలపై ఆరా తీసి మెరుగైన ఫలితాలపై దృష్టి సారిస్తాం.

–చిరంజీవి, డిప్యూటీ డీఈవో